క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



గుంతలు పరిశీలిస్తున్న ఏపీడీ బాలే శివాజీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని సంపద వనాలలో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు తీస్తున్న గుంతలను ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సంపద వనాలలో మొక్కలు నాటేందుకు ఇబ్రహీంపట్నంలో 3 బ్లాకులను ఎస్సారెస్పీకి చెందిన కాకతీయ కాలువ పక్కన గుర్తించామని, వెయ్యి మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ మూడు బ్లాకుల్లో గేటు, చుట్టూ ఫెన్సింగ్ అమర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

రాయికల్: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ రూ. వెయ్యి పింఛన్ పెంచడంపై మంగళవారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, గంగాధర్, గంగారాం, పోశెట్టి, తిరుపతి, రాములు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వాల ద్రోహం



మాట్లాడుతున్న నరేశ్‌రెడ్డి

కథలాపూర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులకు ద్రోహం చేస్తున్నాయని బీమారం మండలం మన్నెగూడెం సర్పంచ్, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గల్ఫ్ జేఏసీ అఖిలపక్షం సమావేశంలో గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రస్తావించారు. గల్ఫ్‌లో ఉన్న రాష్ట్రానికి చెందిన 15 లక్షల మంది నెలకు రూ. 10 వేల విదేశీ మారకద్రవ్యం పంపిస్తున్నారని, ఇందులో 10 శాతం రాష్ట్రానికి పన్ను రూపంలో వస్తుందన్నారు.గల్ఫ్ కార్మికుల సంక్షేమం గురించి ప్రభుత్వం ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

'దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా'



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు విమర్శించారు. పట్టణంలో మంగళవారం మాట్లాడారు. ఉద్యమంలో అమరులైన వారికి తగిన గౌరవం ఇవ్వని బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు రైతులకు నష్టం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. నాయకులు శ్రీనివాస్, హఫీజ్, మారుతి, రాంప్రసాద్, రాజు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని ధర్మారంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ ఆలయంలో మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ. 30 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

పశుగ్రాసం వితరణ

సారంగాపూర్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలకు బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సబ్బ దేవరాజం, దావన్‌పల్లి గంగాధర్ అనే ఇద్దరు రైతులు పశుగ్రాసాన్ని పంపించారు. ఈ సందర్భంగా పశుగ్రాసం పంపించిన రైతులను జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, బీర్‌పూర్ ఎస్సై రవీందర్ అభినందించారు.

అర్హత ఉన్నా.. గుర్తింపు దక్కలే..

- పంచాయతీలుగా ఏర్పాటు కాని గణేశ్‌పల్లి, నాయికపుగూడెం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయిన అనుబంధ గ్రామాలు



నాయికపుగూడెం

సారంగాపూర్: అవకాశం ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గ్రామపంచాయతీలుగా ఏర్పాటు కాక ఆ గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. కానీ మండలంలో పోతారం పరిధిలోని గణేశ్‌పల్లి, లక్ష్మీదేవిపల్లి పరిధిలోని నాయికపుగూడెం గ్రామాలు పంచాయతీలు గా మార్చలేదు. దీనికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి మండలంలో 11 గ్రామాల ఏర్పాటు

సారంగాపూర్ మండలంలో నూతనంగా 7, బీర్‌పూర్ మండలంలో 4 గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశారు. ఈ గ్రామపంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలను ఎన్నుకున్నారు..

గణేశ్‌పల్లి నష్టపోయింది ఇలా..

సారంగాపూర్ మండలంలోని పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లిలో ఒడ్డెరులు, గిరిజనులు కలిపి మొత్తం 500 కంటే ఎక్కువగా జనాభా ఉంటుంది. పోతారం గ్రామ పంచాయతీ నుంచి గణేశ్‌పల్లి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయినప్పటికీ అధికారులు ఈ గ్రామాన్ని గ్రామపంచాయతీగా చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ సరకులు పోతారం గ్రామానికి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. గ్రామంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే 5వ తరగతి వరకు మాత్రమే ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలకు పోతారం వెళ్లాల్సిందే. విద్యుత్ బిల్లుల చెల్లింపు, పంచాయతీ నుంచి పొందాల్సిన ఇతర సౌకర్యాల కోసం పోతారం వెళ్లుతున్నారు. ఎన్నికల్లో ఓటేయాలన్నా పోతారానికే వెళ్లాలి. సారంగాపూర్ మండల కేంద్రంలో అవసరమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ప్రస్తుతం గణేశ్‌పల్లి ప్రభుత్వ భూములను వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది.



సారంగాపూర్ మండలంలోని గణేశ్‌పల్లి గ్రామం

నాయికపుగూడెం..

లక్ష్మీదేవిపల్లి అనుబంధ గ్రామం నాయికపుగూడెం. లక్ష్మీదేవిపల్లికి రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడ జనాభా 400 వరకు ఉంటుంది. ప్రభుత్వం 250 మంది జనాభా ఉన్న బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామాన్ని కొత్తగా గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. కానీ నాయికపుగూడెంను పంచాయతీ చేయలేదు. పంచాయతీ కోసం అధికారులు ప్రతిపాదించలేదు. విద్యార్థులు ప్రాథమికోన్నత పాఠశాల విద్య లక్ష్మీదేవిపల్లికి వెళ్లాలి. రేషన్ బియ్యం, ఇతర సరకుల కోసం లక్ష్మీదేవిపల్లికి వెళ్లాల్సి వస్తోంది. ఎన్నికల్లో ఓటేయడానికి కూడా అక్కడికే వెళ్లాలి. ఈ గ్రామంలో కనీసం ఆర్టీసీ బస్సులు ఆగడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గణేశ్‌పల్లి, నాయికపుగూడెం గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దేనికైనా లక్ష్మీదేవిపల్లికే..



మాకు ఏ అవసరం ఉన్నా లక్ష్మీదేవిపల్లికి కాలినడకన వెళ్లాలి. మా కంటే చిన్న గూడెంలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. మమ్మల్ని పట్టించుకోలేదు. మా గ్రామపంచాయతీ మాకు ఏర్పాటు చేయాలి.

– కాటం చంద్రమ్మ... నాయికపు గూడెం

అన్యాయం చేశారు



గణేశ్‌పల్లిని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయకపోవడం దారుణం. మా గ్రామం పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నా, మమ్మల్ని వేరుగా చూశారు. మా కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి, మాకు అన్యాయం చేశారు.

– గోగుల వెంకటేశ్, గణేశ్‌పల్లి

ఇప్పటికైనా ఏర్పాటు చేయాలి



ఇప్పటికైనా మా సమస్యలను పరిగణనలోకి తీసుకుని మాకు ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి. మా పాలన మాకు ఉండాలి. మా గ్రామానికి సర్పంచ్ మా గణేశ్‌పల్లి వారు ఉండాలి. పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీగా ఏర్పాటు చేయాలి.

– ఇడగొట్టు సాయికుమార్, గణేశ్‌పల్లి

పరిశీలిస్తాం



ప్రభుత్వం మరోసారి కొత్తగా గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు కోరితే ఈ రెండు గ్రామాల ప్రతిపాదనలపై పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తాం. కొత్తగా పంచాయతీల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు పరిపాలన సౌలభ్యం ఉంటుంది.

– శశికుమార్‌రెడ్డి, ఎంపీవో, సారంగాపూర్

ప్రారంభానికి ముస్తాబైన కేజీబీవీ కళాశాల



నూతనంగా నిర్మించిన కేజీబీవీ కళాశాల భవనం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఎస్సారెస్పీ క్యాంపులో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభానికి ముస్తాబైంది. 2005లో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ప్రారంభించగా, 2018లో జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను ప్రవేశపెట్టారు. 6 నుంచి 10వ తరగతి వరకు పాఠశాల విద్యార్థులు చదువుతుండగా కళాశాల ప్రారంభం కావడంతో విద్యార్థినులకు తరగతి గదులు, వసతి కోసం ఇబ్బందిగా మారింది. దీంతో సమగ్ర శిక్షా అభియాన్ నిధులు రూ. 1.35 కోట్లు మంజూరు కాగా, ఈ నిధులతో అదనపు తరగతి గదులు, డార్మెంటరీ గదులను నిర్మించేందుకు జూలై 13, 2019న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ 3 అంతస్తుల భవనం నిర్మించారు. 3వ అంతస్తులో ఇంకా పనులు పూర్తి కాలేదు. కళాశాల భవనంను ఈ నెల 20న ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కళాశాల భవనం ప్రారంభమైతే విద్యార్థినులకు గదుల కొరత తీరనుంది.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

సారంగాపూర్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 21 తరువాత నిరవధిక సమ్మెకు వెళ్తామని సారంగాపూర్ మండల పంచాయతీ కార్మికులు మంగళవారం ఎంపీడీవో, ఎంపీవోలకు వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడం, మరిన్ని డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పులి మల్లేశం, మామిడిపల్లి రాజేందర్, బోదనపు రంజిత్, గోవర్ధన్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నారని, ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు అందిస్తూ సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం విరూపాక్షి గార్డెన్స్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల వారిని ఏకతాటిపైకి తీసుకువచ్చి అండగా నిలిచిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు మరో వెయ్యి రుపాయల పింఛన్ పెంచినట్లు తెలిపారు. మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత తెలంగాణదేనన్నారు. మహిళ సంఘాలకు ధాన్యం కొనుగోళ్ల అప్పగింత, రుణాలు, వారి ఆర్థికంగా నిలబడేందుకు వ్యాపారాలు ఇలా ఎన్నో అందజేయడం జరుగుతుందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరించడానికి మహిళా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. మహిళ అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు చేపడుతున్నారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళ అధికారులు, ప్రజాప్రతినిధులను శాలువ, మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, అదనపు కలెక్టర్ లత, ఆర్డీవో మాధురి, సంక్షేమాధికారి నరేశ్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నూతన కార్యవర్గానికి అభినందన

పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నిక కాగా మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, శ్రీను, నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలవారీగా పాఠ్యపుస్తకాలు పంపిణీ

కథలాపూర్: పాఠశాలలు ప్రారంభం కావడంతో మేడిపెల్లి మండల విద్యావనరుల కేంద్రాల నుంచి ప్రభుత్వ పాఠశాలలవారీగా పాఠ్యపుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలో జెడ్పీ హైస్కూళ్లు 12, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ప్రాథమిక పాఠశాలలు 35, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటికి గాను 23,350 పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి వచ్చాయి. వీటన్నింటిని పాఠశాలల వారీగా హెచ్ఎంలకు అందించారు. ఈనెల 20న విద్యా దినోత్సవం వేడుకలు నిర్వహించి విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా పుస్తకాలు జిల్లా నుంచి రాగానే పంపిణీ చేస్తామని ఎంఈవో నరేశం పేర్కొన్నారు.



హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న సీఆర్‌పీలు

ఎల్లమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయికల్: మండలంలోని కొత్తపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో గౌడ కులస్తులు ఎలమ్మతల్లికి పట్నాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సర్పంచ్ రాజేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు సాయగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

దుర్గామాతా ఆలయం వద్ద అన్నదానం

కథలాపూర్: మండల కేంద్రంలో దుర్గామాత ఆలయం వద్ద మంగళవారం భక్తులకు మహా అన్నదానం చేశారు. ఉదయం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానానికి చింతకుంట గ్రామానికి చెందిన బైర దేవయ్య రూ.1 లక్ష విరాళంగా ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కంటె నీరజ, ఎంపీటీసీ గసికంటి లత, బీజేపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ సబ్బని గంగు, భక్తులు పాల్గొన్నారు.

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని నమిలికొండ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మేకలను ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. నమిలికొండకు చెందిన భూమయ్య అనే మేకల కాపరి సోమవారం తన జీవాలను మేతకు తీసుకెళ్లాడు. రాత్రి ఇంటి వద్ద గల షెడ్డులో తోలాడు. మంగళవారం తెల్లవారుజామున చూసేసరికి జీవాలు కనిపించలేదు. ఎవరో ఎత్తుకెళ్లారని భావించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.లక్ష విలువైన ఎనిమిది మేకలను ఎత్తుకెళ్లారని వాపోయాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు రూ. 1 లక్ష ఆర్థిక సహాయం ప్రకటించటంపై పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావును మంగళవారం క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల వృత్తులను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రాదాన్యం ఇస్తున్నారన్నారు. పట్టణంలో విశ్వకర్మ గాయత్రి ఆలయానికి 2 ఎకరాల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్,పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్కాకుల సద్గురు, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర వర ప్రసాద్, కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానా

మెట్‌పల్లి: పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో మంగళవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని వ్యాపారుల నుంచి రూ.3వేల జరిమానా వసూలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. వాటికి దూరంగా ఉంటూ మున్సిపల్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సిబ్బంది విష్ణు, ముజీబ్, రవీందర్ తదితరులున్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామంలో ఆర్టీసీ అద్దె డ్రైవర్ అశోక్‌పై అదేగ్రామానికి చెందిన పెండం ప్రేమ్‌కుమార్ మంగళవారం రాత్రి దాడిచేశాడు. కోరుట్ల నుంచి పోతారం గ్రామానికి బస్సు వెళ్తుండగా.. పెండెం ప్రేమ్‌కుమార్ అడ్డుగా బైక్ పెట్టాడు. బైక్‌ను పక్కకు తీయాలని డ్రైవర్ కోరగా.. ప్రేమ్‌కుమార్ దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా అశోక్‌పై చేయిచేసుకున్నాడు. ప్రయాణికులు వారించగా దుర్భాషలాడాడు. బస్సును నేరుగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన డ్రైవర్.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్ అశోక్ తెలిపారు.

కంటివెలుగు సిబ్బందికి పాలకవర్గం సన్మానం



కంటి వెలుగు అధికారులు, సిబ్బందిని సన్మానించిన చిట్టాపూర్ పాలకవర్గం

మల్లాపూర్: అంధత్వాన్ని రూపుమాపేందుకే ప్రభుత్వం 'కంటివెలుగు' పథకాన్ని ప్రవేశపెట్టిందని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టాపూర్‌లో కంటివెలుగులో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలను సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, పాలకవర్గసభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణను అంధత్వరహిత రాష్ట్రంగా మార్చడం కోసమేనన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని, కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు నాగార్జున, రాహుల్‌శర్మ, ఎంపీటీసీ మైస లక్ష్మి, ఉపసర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కారోబార్ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్కూల్ బస్సుల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

మెట్‌పల్లి: స్కూల్ బస్సుల యాజమానులు, డ్రైవర్లు రవాణా శాఖ నిబంధనలను పాటించాలని సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని కీర్తి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్‌కు ఫిట్‌నెస్ పత్రాలు పొందిన తర్వాతే నడపాలన్నారు. ఎప్పటికప్పుడు బస్సులను పరిశీలిస్తూ లోపాలను సరిదిద్దుకోవాలన్నారు. బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించొ వద్దన్నారు. సమావేశంలో ఎస్సై శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌లో పాల్గొనాలి

కొండగట్టు: తెలంగాణ యువశక్తిని మేలుకొలిపే దిశగా రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ కోసం చొప్పదండి నియోజకవర్గాల పరిధిలో గల యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని కొడిమ్యాల మండల ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి విక్రమ్‌గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జూన్ 17 వరకు దరఖాస్తు చేసుకోవాలని జూన్ 18న ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుదని విక్రమ్ తెలిపారు.

క్రీడాకారులకు టీషర్ట్‌లు పంపిణీ

రాయికల్: మండలంలోని కట్కాపూర్ గ్రామంలోని క్రీడాకారులకు మంగళవారం బీజేపీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి టీషర్ట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చవ్వ, లచ్చన్న, నాయకులు చుక్క బుచ్చన్న, అత్తినేని శ్రీనివాస్, సల్లూరి తిరుపతి బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జేసీబీల పట్టివేత

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండగా మంగళవారం మూడు జేసీబీలను పట్టుకుని తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌ను వివరణ కోరగా, ఇన్‌చార్జి తహసీల్దార్ నవీన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కథలాపూర్: బీమారం మండలం వెంకట్రావుపేటకు చెందిన రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: రాయికల్ పట్టణం, మైతాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ మంగళవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోరుట్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్

కోరుట్ల రూరల్: కోరుట్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఏ.శ్రీనివాస్‌ను నియమిస్తూ సీఈవో ఎస్. రామానుజాచార్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం ఎంపీడీవోగా పని చేస్తున్న పి.నీరజ అనారోగ్య కారణంతో ఈ నెల 13 నుంచి ఆగస్టు 10 వరకు సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఏ.శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక



వెల్గటూర్: ఎండపల్లి మండలం రాజారాంపల్లి నూతన గ్రామ కమిటీని మంగళవారం మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా గుండ్ల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడుగా మాచెర్ల సంజీవ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా క్యాతం అశోక్ కుమార్, బీ సెల్ అధ్యక్షుడుగా గాజుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉప్పునూటి మహేశ్, సోషల్ మీడియా అధ్యక్షులు ఆడెపు సాయి కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలి పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూదరి రమేష్, గెల్లు శ్రీని వాస్, లక్ష్మణ్, వెంకటస్వామి, రమేశ్, పోలోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.